# కుర్చీ

సన్యాసిరావుకి ఇపుడో సమస్య వచ్చింది.

ఈ మూడు గంటలలోనూ... 'వటుడింతై, ఇంతింతై' అన్నట్లు చిన్న బీజంలా మొదలయిన వ్యవహారం; మహావృక్షమయి అతడి ఎదుట నిలిచింది.

అతని మనోవ్యథకు కారణమయినదీ, అతడిని ఇంత చికాకులో ముంచేసినదీ ప్రక్కసీటులోని 'కుర్చీ'.

సన్యాసిరావు 'ఎకవుంట్సు సెక్షను'కు కొత్తగా వచ్చేడు. ఈ ఉదయమే సెక్షనులో అడుగుపెట్టాడు. అది ఎంతో పెద్దగది. అయినా ఉన్నవి మాత్రం రెండే రెండు కుర్చీలు, వాటికి ఎదురుగా టేబిళ్ళు, తాను కాక తనతోబాటు, తనలాటివాడే, మరో గుమస్తా!

తన కుర్చీ బాగా పాతది. అందునా కర్రకుర్చీ. ఈ మూడు గంటలకే నడుం సలుపు ఆరంభమయింది. అందులో తను వచ్చినప్పటినుంచీ, తనకు తెలియకుండానే ముళ్ళ మీద కూర్చున్నట్లుగా వుంది.

తన తోటి గుమస్తా కృష్ణమూర్తి కూర్చునేది 'రివాల్వింగ్ కుర్చీ' చూడటానికి పాతదానిలా కనిపించినా, దాని 'రివాల్వింగ్ ఏక్షను' ఏమాత్రము చెడలేదు. సీటు కూడా అతి మెత్తగా వుంది. డాబుగా లేకపోయినా సుఖంగా సౌకర్యంగా వున్నట్లు తోచింది.

ఈ మూడుగంటలుగా, కృష్ణమూర్తి ఆ కుర్చీలో నుండి ఒక్క పర్యాయం కూడా లేవలేదు. టేబిలుకు కాస్త ఆవలగా వున్న ఫైళ్ళు అందుకోవాలంటే తమాషాగా నడుంతో కుర్చీ జరుపుకుంటూ ఐస్‌మీద 'స్కేటింగ్' చేస్తున్న వాడికి మల్లే, కాళ్ళునేలమీద తాటిస్తూ వెళ్ళి కావల్సిన ఫైలు తీసుకుని మళ్ళీ తనసీటుకు చేరుకుంటున్నాడు. అతడు ఆఫీసులో పనిచేస్తున్నవాడిలా కాకుండా ఏదో 'గేమ్' ఆడుకుంటున్నవాడిలా ప్రవర్తిస్తున్నాడు! మరి తనో?!!

'ఫైళ్ళరేక్' దగ్గరకు వెళ్ళటానికి ఈ మూడు గంటల్లోనూ కనీసం పదిసార్లయినా లేచాడు. కృష్ణమూర్తి ఆఖరికి మంచినీళ్ళకు కూడా లేవటంలేదు. కుర్చీ కిరకిరమని జరుపుకుంటూ వెళ్ళి కూజాలోంచి గ్లాసులోకి నీళ్ళువంపుకుని, కుర్చీ వెనుక ఫ్రేముకు విలాసంగా జారగిలబడి, నోట్లో పోసుకుంటున్నాడు. ఆ కాసిని మంచినీళ్ళు 'విస్కీ' చప్పరిస్తున్నట్లు మెల్లగా తాగుతూ వుంటే, ఒళ్ళుమండిపోయింది సన్యాసిరావుకు! 'బోడి షోకులూ, వీడూనూ! కుర్చీ దిగడు కాబోలు!' అనుకున్నాడు.

నీళ్ళు తాగేసి, కుర్చీ కిరకిరమంటూ నడుపుకుంటూ, నడుంతో, కాళ్ళతో తోసుకుంటూ తనవెనుకగా వచ్చి ఫైళ్ళరేక్‌లో ఫైలు తీసుకుని మళ్ళీ తన టేబిలు దగ్గరకు వెళ్ళిపోయాడు.

ఆ కుర్చీ కిరకిర శబ్దం ప్రాణసంకటంగా వుంది. సన్యాసిరావుకి! ఆఖరికి

ఉండబట్టలేక లంచ్ సమయంలో అనేశాడు "బ్రదర్ అలా కుర్చీ చప్పుడు చేసుకుంటూ తిరగకపోతే, దానిలోనుండి లేచి నాలుగు అడుగులు వేయరాదా?"

కృష్ణమూర్తి తల ఎత్తిచూసేడు! సన్యాసిరావు వంకజూసి చిన్నగా చిరునవ్వు నవ్వేడు. తరువాత తలదించుకుని మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు. సన్యాసిరావుకి తలకొట్టేసి నట్లయింది.

'జోడి కుర్చీ వీడికే వుందని గర్వం కాబోలు! ఎంత సౌకర్యవంతమయిన కుర్చీ అయినా లేవకుండా గంటల తరబడి అందులో కూర్చుని వుండిపోతే, నడుం వంగిపోతుంది! వీడు రిటైరయ్యేనాటికి వీడి నడుం విల్లులా వంగిపోతుంది' అనుకున్నాడు మనసులోనే కసిగా! 'అయినా తనకెందుకు? వాడి ఏడుపు ఏదో వాడు ఏడుస్తాడు' అని మరికొంతసేపు అనుకున్నాడు. భోజనం ముగించి ఆఫీసు వరండాలోనికి వచ్చేడు.

ప్యూను అప్పలస్వామి ఎదురయ్యేడు. "సార్! కిళ్ళీ తెమ్మంటారా?" అడిగేడు

"బజారుకు వెళ్తున్నావేమిటి?"

"అవును సార్! రోజూ ఈ సమయంలో వెళ్తాను"

"ఎందుకు?"

"రోజూ కృష్ణమూర్తిగారికి చెక్క, యాలకపందు, పిప్పరమెంటు పువ్వు వేసి, కిళ్ళీకట్టించి తేవాలికదా! ముదరాకులయితే వేసుకోరు. అందుకని తుని కవటాకులతో కట్టించాలి. మామూలు సున్నంలాభంలేదు. పరిమళసున్నం రాయించాలి. జాజికాయ, కుంకుమపువ్వు కూడా వేయించి కట్టించాలి. ఆ కిళ్ళీ బజారులోనే వుంటుంది. ఇక్కడ దొరకదు" అన్నాడు అప్పలస్వామి.

'ఆహా! రోజూ ఆ కిళ్ళీ నములుతూ కృష్ణదేవరాయలవారు సింహాసనంలో ఆసీనులయినట్లు కుర్చీలో ఆసీనులవుతారు కాబోలు మన కృష్ణమూర్తిగారు' అని మనసులో అనుకుని.. బయటకు మాత్రం "నాకువద్దులే... అదిసరే, మన ఆఫీసులో మంచి కుర్చీలు ఏమీలేవా?" అంటూ అడిగేడు.

"ఏమీవేవుసార్' పెదవి విరిచేడు అప్పలస్వామి.

"కృష్ణమూర్తికి మరి ఆ రివాల్వింగ్ కుర్చీ ఎలా వచ్చింది?" ఎంత ఆపుకుందామనుకున్నా ఆగకుండా మనసులోని ఈ ప్రశ్న బయటకు తన్నుకు వచ్చేసింది.

"అదంతా పెద్ద కథలెండి"

"ఏమిటి?" కుతూహలంగా అడిగేడు.

"ఇంతకు ముందు ఆ కుర్చీ మన ఆఫీసరుగారిది. దానికి ప్లాస్టిక్ పేము పాడయిపోయింది. అందుకని మరోటి ఆర్డరిచ్చి రప్పించుకున్నారు. దీన్ని స్టోరురూములో పడెయ్యమన్నారు, తరువాత బాగు చేయిద్దామని! అపుడు మన కృష్ణమూర్తిగారు దాన్ని బయటకు తెచ్చి, జీపుసీటు చిరిగిపోయిందివుంటే, దానిలోని స్పాంజిముక్కలు ఈ సీటులో

పెట్టి కుట్టుకున్నారు. కింద స్ప్రింగు పాడయితే దాన్ని కూడా స్వయంగా బాగు చేసుకున్నారు. 'స్క్రూ' బిగించుకుని వాడుకుంటున్నారు. ఆ కుర్చీ వేరెవ్వరికీ ఇవ్వడాయన" అన్నాడు అప్పలస్వామి వెకిలిగా నవ్వుతూ.

సన్యాసిరావుకి వాడి నవ్వు చూస్తే ఒళ్ళు మండిపోయింది.

"అదెవడికి కావాలోయ్! బోడి కుర్చీ!" అంటూ గదిలోనికి వెళ్ళిపోయాడు.

ఉదయం ఆఫీసుకు వచ్చినది మొదలు సాయంకాలం వెళ్ళిపోయేవరకూ కృష్ణమూర్తిని గమనిస్తూనే వున్నాడు సన్యాసిరావు. భోజనానికీ, ఆఫీసరు పిలుపులకూ తప్ప ఆ కుర్చీని వదలటంలేదు కృష్ణమూర్తి!

గదిలో ఏ వస్తువు కావాలన్నా రణగొణధ్వనితో కుర్చీ జరుపుకుంటూ తిరుగుతున్నాడు. నాలుగు కాగితాలుచూసి, పెద్ద కష్టపడిపోయినవాడిలా ఒళ్ళు విరుచుకుంటూ కుర్చీలో వెనక్కు ముందుకూ ఊగుతున్నాడు. అలా వాలినప్పుడల్లా కుర్చీ మూలుగుతోంది. ఆ శబ్దం సన్యాసిరావుకి ఏమాత్రం సరిపడటం లేదు! ఆ శబ్దమే అన్న మాటేమిటి? ఆ కుర్చీ అన్నా, అందులో నుండి లేవని కృష్ణమూర్తిఅన్నా, సన్యాసిరావుకి ఆ కొద్దిగంటలలోనే ఓ విధమయిన జుగుప్స ఏర్పడింది.

వారం దినాలు భారంగా గడిచేయి.

ఈ వారం దినాల్లోనూ కుర్చీ ఒకవిషమ సమస్యగా మారిపోయింది. ఆ కుర్చీ కదిలిన శబ్దాలు చెవిన పడుతూ వుంటే, ఏ పని చేయటానికీ తోచటం లేదు. తమ గదిని అనుకొనే ఆఫీసరుగది వుంది. ఆయన గది సౌండ్‌ప్రూఫ్! ఎ.సి. చేయబడింది. కొత్త స్ప్రింగులతో ద్వారాన్ని కరుచుకుని వుంటాయి ఆగది తలుపులు. తలుపులు మూసివుండటంవలన ఈ గదిలో బాంబులు పేల్చినా, ఆఫీసరుగదిలోనికి వినిపించదు! అందువలన ఈ కిరకిర శబ్దాలు ఆయన చెవికిసోకి, చివాట్లు పెడతాడన్న ఆశ అసలులేదు.

కాకపోతే, ఆ గదికి వున్న అద్దాలగుండా ఈ గదిలో ఏం జరిగేది కన్పిస్తూనే వుంటుంది. ఇటూ అటూ ఊగుతూ, గది అంతా కుర్చీమీదే కలయతిరుగుతున్నందులకు ఆయన ఏమీ అనటం లేదు కృష్ణమూర్తిని. రోజురోజుకూ సన్యాసిరావు మనసులో చికాకు పెరిగిపోతోంది..

ఓ రోజున ఆఫీసరు పిలిస్తే ఫైళ్ళు తీసుకుని అతని గదిలోకి నడిచి వెళ్తున్నాడు కృష్ణమూర్తి. సన్యాసిరావుకు అతడిని ఏడిపించాలని బుద్ధి పుట్టింది.

"బ్రదర్! నడిచివెళ్ళటమెందుకు? కుర్చీ నదుంతో తోసుకుంటూ వెళ్ళిపో! కావాలంటే ఆఫీసరు గది స్ప్రింగ్ డోర్ నేను తెరచి పట్టుకుంటాను" అన్నాడు ఎగతాళిగా.

కృష్ణమూర్తి తాపీగా చిరునవ్వు నవ్వేడు. తరువాత మెల్లగా అన్నాడు "నువ్వు తలుపు తెరిచి పట్టుకుంటావ్, నేను కుర్చీతోసుకుంటూ వెళ్తాను, కానీ ఆఫీసరు ఏమైనా అనుకుంటాడేమో" మాటలు ముగించి ఆఫీసరుగదిలోనికి వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

'ఓరి వీడి అఘాయిత్యంకూలా! ఆఫీసరు ఏమీ అనుకోకపోతే, కుర్చీ కిరకిరలాడించుకుంటూ వాడి దగ్గరకి పోతాడుకాబోలు! ఆఫీసరుగదిలోకే నన్న మాటేమిటి? గడపలు, మెట్లు లేకుండా వుంటే, సిటీ బస్సు ఎక్కటం మానేసి, తిన్నగా ఇంటికి కూడా ఈ కుర్చీతోసుకుంటూ వెళ్ళిపోతాడు కాబోలు! హు!' అనుకున్నాడు సన్యాసిరావు.

తర్వాత ఖాళీగా వున్న కుర్చీ వేపుకసిగా చూసేడు. స్ప్రింగు మీద మెల్లగా ఊగుతోంది అది! తనవంక చూసి అది కూడా హేళన చేస్తున్నట్లు అన్పించింది.

'ఇహలాభంలేదు! ఈ కుర్చీ వ్యవహారం అంతుతేల్చాలి! కుర్చీ కిందభాగంలో వున్న స్ప్రింగుకు ఒక లావాటి 'స్క్రూ' వుంది. దాన్ని ఊడదీస్తే సరి! వెనక్కి ఊగే సమయంలో కిందపడతాడు. ఏనడుమో, కాలో విరిగిపోతే కానీ వీడి కులాసా తగ్గదు' అనుకున్నాడు సన్యాసిరావు.

మర్నాడు ఉదయం... రోజూ కంటె అరగంట ముందుగానే ఆఫీసుకు వచ్చేశాడు. తనగదిలోనికి వచ్చి తలుపుదగ్గరగా వేశాడు. మెల్లగా రివాల్వింగ్ కుర్చీ వద్దకు వెళ్ళేడు.

ఇంతకాలం అందులో కూర్చోటమే కుదరలేదు. అసలు, అది ఖాళీగా కన్పిస్తేకదా, కూర్చోటానికి? కృష్ణమూర్తి ఒక్క నిమిషం కూడా కుర్చీ వదలడాయె! మెల్లగా కుర్చీలో కూలబడ్డాడు సన్యాసిరావు! మెత్తగా, హాయిగా, పువ్వుల పానుపుమీద కూర్చున్నట్లు వుంది.

రెండుచేతులూ, సైడు రెస్టులమీద ఆన్చేడు. ఓహో ఏమి సుఖం! నడుం వెనక్కు వంచేడు!! వెనుక ఫ్రేం మెత్తగా ఆనింది. ఆహా! ఏమి హాయి!! మెల్లగా వెనక్కి వంగేడు! వంగుతున్న కొద్దీ, పూలపడవమీద తేలిపోతున్నట్లుంది" కాళ్ళు రెండూ ఎత్తి టేబిలుకు దన్ను పెట్టేడు. ముందుకూ, వెనక్కూ ఊగుతూ వుంటే గాలిలో విహరిస్తున్నట్లుంది! ఎంత సౌఖ్యం!

అందుకే కృష్ణమూర్తి నిమిషమయినా ఈ కుర్చీ వదలడు. నడుంతో ముందుకు జరుపుతూ, మెల్లగానే నేలమీద కాళ్ళతో తన్నుతూ గదంతా కలయతిరిగేడు.

కూజా దగ్గరగా వెళ్ళేడు. గ్లాసులోకి నీళ్ళువంపుకున్నాడు. కుర్చీలో వెనక్కు వాలి, మెల్లగాసిప్ చేశాడు. గ్లాసు కూజా పక్కన వుంచేసి మళ్ళీ టేబులు దగ్గరకు వచ్చేడు కుర్చీతోసుకుంటూ. అందులోని సుఖం సన్యాసిరావుకు బాగా అనుభవం లోనికి వచ్చింది.

తర్వాత కుర్చీలో నుండి లేచాడు. కుర్చీ ఎదురుగా నేలమీద కూర్చుని కుర్చీ కింది భాగమంతా కలయజూశాడు. సీటు క్రింది భాగాన పెద్ద స్ప్రింగు వుంది. ఆ స్ప్రింగు చుట్టూ రేకు గొట్టం! గొట్టం క్రింద భాగంలో తాపడం చేసినట్లు ఇనపదిమ్మ! దిమ్మకు నాలుగువైపులా కొమ్మల్లా వుండి వాటికి చివర చక్రాలు వున్నాయి. గొట్టంలోని స్ప్రింగును పట్టుకునేందుకు ఒక పెద్ద సైజు స్క్రూ దానికి బిగించి వుంది!

ఆ స్క్రూ తీసిపారేస్తే? కుర్చీలో కూర్చుని వెనక్కి వంగినపుడు స్ప్రింగు కాస్తా బయటకు జారిపోతుంది. జారిపోతే, కుర్చీవెనక్కు పడిపోతుంది భేష్! "ఈ స్క్రూ వూడదీసి

పారెయ్యాలి" అనుకున్నాడు సన్యాసిరావు. తనకి కిరకిరల శబ్దం కూడా తప్పిపోతుంది' అనే ఆలోచన రాగానే పెద్ద రిలీఫ్‌గా ఫీలయ్యాడు. మెల్లగా స్క్రూ ఊడదీయటానికి ప్రయత్నించేడు. ఉహూ! కదలటంలేదు.

అల్మారాలో నుండి కత్తితీసి దాని మొనతో తిప్పేడు. కిరకిరమంటూ గట్టిగా తిరిగింది. అతి కష్టంమీద ఊడి వచ్చింది. దాన్ని తీసుకువెళ్ళి చెత్తబుట్టలో పడేసి పైనకాగితాలు కప్పివచ్చేడు. ఇపుడు సన్యాసిరావు మనసు తేలిక పడింది. తనసీటులో కూర్చుని ఫైళ్ళు బయటకు తీశాడు.

పది కావటానికి ఇంకా పదినిమిషాల వ్యవధి వుంది. ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు. సమయం గడుస్తోంది. గోడగడియారం పదిగంటలు కొట్టింది.

కృష్ణమూర్తి ఇంకారాలేదు. 'ఓ గంటసేపు పర్మిషను తీసుకున్నాడేమోవీడు! అలా అయితే ఇంకో గంటవరకూ వీడినడుం విరగదు!' అనుకున్నాడు అసంతృప్తిగా.

ఇంకో రెండు నిమిషాలు గడిచేయి. అంతలో ఆఫీసరు వచ్చేడు. "గుడ్ మార్నింగ్ సార్" సన్యాసిరావు లేచి నిలబడి అన్నాడు

"గుడ్ మార్నింగ్! నిన్నటి బిల్డింగు సొసైటీ ఫైలు తీసుకురండి! ఎస్టిమేటు మార్పుచేయాలి" అన్నాడాయన.

"అది కృష్ణమూర్తి సొరుగులో వుందిసార్"

"ఈవేళ అతడు 'కాజువల్ లీవు' తీసుకుంటానన్నాడు. డూప్లికేటు తాళంతో అతడి సొరుగు తెరిచి ఆ ఫైలు వెదికి తీసుకురండి" అంటూ ఆఫీసరు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

సన్యాసిరావుకి ఒక్కసారి నిస్సత్తువ ఆవరించింది. ఈ వేళ కృష్ణమూర్తిరాడు! తన పథకం పారదు! ఈవేళ వాడి నడుం విరగదు! తన కసితీరదు! మనసులో అసంతృప్తి రగులుకొంది అతనికి! సొరుగు తెరిచి, ఫైలు వెదికి దాన్ని పట్టుకుని ఆఫీసరుగదిలోకి వెళ్ళేడు. ఫైలు అందించి నిలబడ్డాడు.

అంతలోనే తలుపులు తెరుచుకుని బిలబిల్లాడుతూ ముగ్గురు వ్యక్తులు లోనికి వచ్చేరు "గుడ్ మార్నింగ్" అంటూ ఆఫీసరు తొట్రుపాటుతో లేచి నిలబడి "గుడ్ మార్నింగ్" అంటూ వాళ్ళకి షేక్‌హేండ్ ఇచ్చేడు. వాళ్ళల్లో తెల్లగా పొడుగ్గా వున్న వ్యక్తిని సన్యాసిరావు గుర్తుపట్టేడు. ఆయన కంపెనీ రీజియనల్ మేనేజర్! హెడ్డాఫీసు నుండి వస్తున్నాడు కాబోలు! మిగిలిన వాళ్ళు బహుశ: అతని మిత్రులయివుంటారు. ఆఫీసరు వాళ్ళరాకకు కాస్త ఆశ్చర్యపడుతూ, వాళ్ళకు కుర్చీలు చూపించేడు. ఆ గదిలో ఆఫీసరు కుర్చీ కాక ఇంక రెండే కుర్చీలువున్నాయి. ఆఫీసరు సన్యాసిరావు వంక తిరిగి "కుర్చీ తీసుకురండి" అన్నాడు. సన్యాసిరావు బయటకు వచ్చేడు. ప్యూను అప్పలస్వామి ఎక్కడా కన్పించలేదు.

ఏదో కుర్చీ తానే తీసుకు వెళ్లాలి. ఏ కుర్చీ తీసుకువెళ్లటం? కృష్ణమూర్తి కుర్చీయే

తీసుకువెళ్ళాలి! కానీ దానికి 'స్క్రూ' లేదు. అందులో కూర్చొని వెనక్కు వాలితే నడుం విరుగుతుంది. సన్యాసిరావును క్షణం సేపు మతిపోయినట్లయింది. తన ఖర్మకాలి, రీజినల్ మేనేజర్ అందులో కూర్చుంటే? వెనక్కు పడ్డాడో, తన ఉద్యోగంపని ఖాళీ! అతడికి ఏం చేయాలో పాలుపోలేదు.

అంతలో ఆఫీసరు సుడిగాలిలా బయటకు వచ్చేడు. "కుర్చీ తీసుకురమ్మంటే అలా నిలబడిపోయారే?" అంటూ కసిరేడు.

" ఏ కుర్చీసార్?" నీరసంగా అడిగేడు

" ఆ రివాల్వింగ్ కుర్చీ తీసుకురండి" అంటూ స్ప్రింగ్‌డోర్ తెరిచిపట్టుకున్నాడు ఆఫీసరు. సన్యాసిరావు కుర్చీని మెల్లగా ఆఫీసరు గదిలోనికి తోసుకువెళ్లేడు.

రీజినల్ మేనేజరు అందులో కూర్చుంటూ సన్యాసిరావు వంక తిరిగి థేంక్స్ చెప్పేడు. సన్యాసిరావు సమాధానంగా చిరునవ్వు నవ్వి, చేతులు కట్టుకుని ఒకవారగా నిలబడ్డాడు!

రెండు నిమిషాల తర్వాత ఆఫీసరు సన్యాసిరావును దగ్గరగా రమ్మని సంజ్ఞచేసి "కాఫీలు రప్పించండి" అంటూ చెవిలో రహస్యంగా చెప్పేడు.

సన్యాసిరావు తలవూపి బయటపడ్డాడు. బయటవరండాలో పచార్లు చేస్తున్న అప్పలస్వామి చేత కాఫీలు తెప్పించి వాటితో బాటుగా తానుకూడా లోనికి వెళ్ళేడు.

రీజనల్ మేనేజరు ఫైల్సు తిరగేస్తూ కాఫీసిప్ చేస్తూ, రివాల్వింగ్ కుర్చీలో మెల్లగా వెనక్కు వంగుతున్నాడు. సన్యాసిరావు ప్రాణాలు పైకి ఎగిరిపోయాయి.

మేనేజరు ఇంకా వంగుతున్నాడు. కుర్చీ మూలుగుతోంది. ఇంకా వెనక్కు వాలుతోంది. లాభంలేదు!! మేనేజరు పడిపోవటం ఖాయం! అతడి నడుం విరిగిపోవటం ఖాయం!! తన ఉద్యోగం ఊడటం అంతకంటె ఖాయం!! మేనేజరు నడుంమీద తన ఉద్యోగం ఆధారపడి వుంది. గట్టిగా అరిచి 'అలా వెనక్కువంగవద్దని' చెప్పాలనుకున్నాడు. కానీ, నోటమాటలుకానీ, శబ్దాలు కానీ పెగిలి బయటకు రాలేదు. సన్యాసిరావుకు ఒడలంతా చెమటలు పోశాయి!.

మేనేజరు ఫైలులో ఏదో చూపిస్తూ, మళ్ళీ ముందుకు వంగేడు.

'అమ్మయ్య! బ్రతికేను' అనుకున్నాడు సన్యాసిరావు.

అంతలోనే మళ్ళీ కాఫీతాగుతూ వెనక్కువాలేడు మేనేజరు. సన్యాసిరావు గుండె దడ అధికమయింది. మేనేజరు వంకే గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడు. ఊగి ఊగి కప్పు టేబిలుమీద వుంచటానికి మళ్ళీ ముందుకువచ్చేడు. సన్యాసిరావు మనసులో వేయిదేముళ్ళకు మొక్కేడు. 'మళ్ళీ వెనక్కు వంగకుండా చూడు స్వామీ' అంటూ వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నాడు.

రెండు నిమిషాల తర్వాత వాళ్ళు లేచి నిలబడ్డారు. కరచాలనాలు పూర్తి అయిన

తరువాత వెళ్ళిపోయారు. సన్యాసిరావు గుండెకుదుటపడింది. వెర్రివాడిలా కుర్చీవంక చూస్తూ ఛాతీమీద రాసుకున్నాడు. ఆఫీసరు వాళ్ళను సాగనంపి లోనికి వచ్చేడు.

సన్యాసిరావు వంక గుడ్లు మిటకరించి చూస్తూ "ఇందాకా కుర్చీ తెమ్మంటే అలావుండి పోయారేమిటి?" అంటూ కస్సుమన్నాడు.

సన్యాసిరావు కొంతసేపు తటపటాయించి చివరకు చెప్పేడు. " ఆ కుర్చీ బాగాలేదుసార్"

" ఏం? దానికి ఏమయింది"

"క్రింది స్క్రూ వూడిపోయింది. వెనక్కి వంగితే పడిపోతారనే భయంతో తేలేదు. ఇంకాస్త వెనక్కు వంగివుంటే ఆయన నడుం విరిగిపోయి వుండేది" నీళ్ళునములుతూ చెప్పేడు. ఆఫీసరుకు నవ్వు ఆగింది కాదు. పడీ పడీ నవ్వేశాడాయన! "భలేవారండీ మీరు! ఇపుడా ఆ సంగతి చెప్పేది? ఆయన పడిపోయివుంటే గొడవయిపోయేది" అన్నాడు.

సన్యాసిరావు కాళ్ళీడ్చుకుంటూ బయటకు వచ్చేశాడు.

పావుగంట తర్వాత అప్పలస్వామి రివాల్వింగ్ కుర్చీ మోసుకుంటూ ఆఫీసరు గదిలోంచి బయటకు వచ్చేడు. సన్యాసిరావు మనసులో ఆనందం పొంగి పొర్లింది.

'కుర్చీపీడ విరగడయిపోతుంది. దీన్ని తీసుకువెళ్ళి స్టోరుగదిలో పడెయ్యమన్నాడు కాబోలు. రేపటినుండీ రణగొణధ్వని తప్పుతుంది' అనుకుంటూ గుండెనిండా ఊపిరిపీల్చుకున్నాడు. విలాసంగా కాళ్ళు ఊపుతూ "ఏమోయ్! అప్పలస్వామీ! దాన్ని ఎక్కడికి తీసుకుపోతున్నావ్?" అంటూ అడిగేడు

"స్క్రూ వూడిపోయిందటకదా! కొత్త స్క్రూ వేయించి, మరి ఊడిపోకుండా వెల్డింగు చేయించుకుని రమ్మన్నారు" అంటూ బయటకు వెళ్ళిపోయాడు అప్పలస్వామి.

సన్యాసిరావు నీరసంగా వెనక్కు వాలేడు! అతని కనుల ఎదుట రేపటి దృశ్యం కనబడింది!!

'కుర్చీ వదలని కృష్ణమూర్తి కులాసాగా, విలాసంగా రివాల్వింగ్ చైర్‌లో వెనక్కూ ముందుకూ ఊగుతున్నాడు!!'

★

(స్వాతి మంత్లీ 1972)